# బీఆర్ఎస్‌తోనే ప్రజలకు సంపూర్ణ భరోసా

- శేరి లింగంపల్లి అభ్యర్థి విప్ గాంధీ
- డిసెంబరు 3న అంబరాన్నంటేలా..



ప్రచారంలో భాగంగా డోలు వాయిస్తున్న విప్ గాంధీ

మియాపూర్, నవంబరు 21: భారతీయ రాష్ట్ర సమితి తెలంగాణలో ప్రజలకు శ్రీరామరక్ష అని కుల మతాలకు అతీతంగా సంపూర్ణ భరోసా కల్పించగలిగిన ఏకైక సమర్థ రాజకీయ పార్టీయని విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రజలందరి సంక్షేమం కోసం చేస్తున్న కృషితో అన్ని వర్గాల పూర్తి మద్దతుతో హ్యాట్రిక్ విజయం సాధించి డిసెంబరు 3న అంబరాన్నంటేలా వేడుకలను నిర్వహించనున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వివేకానందనగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, కూకట్‌పల్లి డివిజన్‌లో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలతో సహా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి గాంధీ మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమ పంథాతో స్వరాష్ట్రాన్ని సాధించి వెనకబడిన తెలంగాణను పురోగతి పరంగా పరుగులు తీయిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎంతో సంతోషంగా ధైర్యంగా జీవించే వ్యాపారాలను నిర్వహించుకునే గొప్ప వాతావరణాన్ని కల్పించిన బీఆర్ఎస్ సర్కారుకు ప్రజలు పూర్తి అండగా నిలవాలని గాంధీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఆయా డివిజన్‌ల పార్టీ శ్రేణులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

### గులాబీ గూటికి బీజేపీ నేతలు

హఫీజ్‌పేట్ డివిజన్ సాయి నగర్ యూత్ కాలనీకి చెందిన బీజేపీ మోచీ సంఘం ప్రతినిధులు పార్టీ నేత అక్బర్ ఆధ్వర్యంలో విప్ గాంధీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గాంధీ మాట్లాడుతూ సబ్బండ వర్ణాలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, వారి ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం తథ్యమన్నారు. ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన ఏకైక సీఎం కేసీఆర్ అని, రాబోయే రోజులలో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలందరికి చేరనున్నాయని గాంధీ పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో శివఠాకూర్, మాధవ్, నందన్ తదితరులున్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రంగారావుల ఆధ్వర్యంలో విప్ గాంధీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పాలన

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్..
- మారేడ్‌పల్లి నేహ్రూనగర్ పార్కులో వాకర్స్‌తో మంత్రి సమావేశం



మారేడ్‌పల్లి నేహ్రూనగర్ పార్కులో వాకర్స్‌తో అభ్యర్థి సోదరి నివేదిత, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, తదితరులు

మారేడ్‌పల్లి, నవంబర్ 21: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మారేడ్‌పల్లి నేహ్రూనగర్ పార్కులో కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి జి. లాస్య నందితకు మద్దతుగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అభ్యర్థి సోదరి నివేదిత, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, మాజీ జీహెచ్ఎంసీ కో ఆప్షన్ సభ్యుడు సీఎన్ నర్సింహ ముదిరాజ్‌లు మంగళవారం వాకర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ, అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. కంటోన్మెంట్‌లో దివంగత ఎమ్మెల్యే బి.సాయన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోటాను కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులను చూసి కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి జి.లాస్య నందితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వాకర్స్‌ను కోరడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు రాజు, హన్మంత్ యాదవ్, వినోద్ కుమార్, డీబీ దేవేందర్, సి.సంతోష్ యాదవ్, అనిత, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఐదో వార్డులో..** లాస్య నందితకు మద్దతుగా సంజీవయ్యనగర్ వీకర్ సెక్షన్ కాలనీ, గణేష్ నగర్, రైల్వే కాలనీ, శోభనా కాలనీ, రాధిక కాలనీ తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకుడు తేలుకుంట సతీష్ గుప్తా, అరుణ్ జ్యోతి లు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## కాంగ్రెస్‌ను నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే..

- ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్
- యూత్ కాంగ్రెస్ నుంచి భారీగా బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన యూత్ కాంగ్రెస్ నాయకులతో ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 21: ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా ఖైరతాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ నాజర్‌తో పాటు పెద్ద సంఖ్యలో యూత్ కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కుక్కలు చింపిన విస్తరిలా మారిందని, ఆ పార్టీని నమ్ముకుంటే నట్టేట మునగడం ఖాయమని, నియోజకవర్గంలోని పలు డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రధానంగా మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్న కాంగ్రెస్ వైఖరి అందరికీ అర్థం కావడంతో వారంతా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్రనేత పైజల్ జాబ్రి, నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఎండీ మోయిజ్‌తో పాటు పార్టీలో చేరిన ఫైజాన్ ఖుద్దూస్, మహ్మద్ నదీమ్, మహ్మద్ అవేజ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్

*అంబర్‌పేట బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే 'కాలేరు'*

అంబర్‌పేట, నవంబర్ 21: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. తన ఎన్నికల ప్రచారంలో భాగంగా కాలేరు అంబర్‌పేట డివిజన్‌లోని ఆజాద్‌నగర్, ప్రేంనగర్, గోల్నాక డివిజన్‌లోని లక్ష్మీనగర్, తులసీరాంనగర్(లంక) తదితర ప్రాంతాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గోల్నాక డివిజన్ తన సొంత డివిజన్ అని, ఎల్లప్పుడు తనను ఆదరిస్తున్నదని చెప్పారు. ఎప్పటిలాగే ఇప్పుడు కూడా గోల్నాక డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని విన్నవించారు. ప్రతి ఒక్కరు ఈ నెల 30న ఉదయాన్నే పోలింగ్ బూత్‌కు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.



గోల్నాక లంకలో ముస్లింల నుంచి ఓట్లు అభ్యర్థిస్తున్న కాలేరు వెంకటేశ్

## బీఆర్ఎస్‌లోకి టీజేజేఎఫ్ అధ్యక్షురాలు ఉషారాణి



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కోటగిరి ఉషారాణి

ఆర్కేపురం, నవంబర్ 21: తెలంగాణ జన జాగృతి ఫోరం అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో సుధీర్ రెడ్డి గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రం మరింత పురోగతి సాధించాలంటే మరోమారు బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ఆమె ఆకాంక్షించారు.

## కంటోన్మెంట్‌లో బీజేపీకి బిగ్ షాక్

**సీనియర్ నేత కేబీ శంకర్ రావు రాజీనామా**




సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు కేబీ శంకర్ రావు

బొల్లారం, నవంబర్ 21: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరిలో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. బీజేపీ సీనియర్ నాయకుడు కేబీ శంకర్ రావు మంగళవారం తిరుమలగిరిలో బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కంటోన్మెంట్ బీజేపీ పార్టీలో కొంత మంది స్వార్థ రాజకీయాలు చేసున్నారన్నారు. బీజేపీ నాయకుల ఒంటెద్దు పోకడ వల్లే తాను పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు. పార్టీలో దళితులకు స్థానం లేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, బీఆర్ఎస్ తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. మంగళవారం సాయంత్రం కంటోన్మెంట్ పికెట్ చౌరస్తాలో కేటీఆర్ రోడ్ షో కార్యక్రమంలో భాగంగా తాను కార్యకర్తలతో కలిసి గులాబీ పార్టీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్టిన్ లూథర్, అమర్, వినోద్, జీవకన్, అవినాష్, వినయ్, శశికాంత్, అశోక్ కుమార్, సురేందర్, ప్రమోద్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేశాను.. ఆశీర్వదించండి

*రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్ గౌడ్*



కండువా కప్పి షేక్ ముక్తార్‌పాషను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, నవంబర్ 21: రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత వృద్ధిలోకి తెస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ, ఎయిర్ పోర్టు కాలనీ, ఇంద్రారెడ్డి కాలనీ, ఊటుపల్లి, తొండుపల్లి, గొల్లపల్లిలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గొల్లపల్లిలో నిర్వహించిన రోడ్డు షోలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. 50 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందకుండా దోచుకున్నారని విమర్శించారు.